AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
15-9-2025 (Monday)
MAIN EDITION

## పసిడి ప్రియులకు ఊరట..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** గత కొద్ది రోజులుగా బంగారం ధరలు పైపైకి పోవడం మనం చూస్తూనే ఉన్నాం. ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. అయితే తాజాగా బంగారం, వెండి ప్రియులకు గుడ్ న్యూస్ వచ్చింది. నిన్నటితో పోల్చుకుంటే కాస్త తగ్గాయి. సోమవారం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,11,160 కి చేరుకోగా, 22 క్యారెట్ల ధర రూ. 1,01,890 గా నమోదైంది. ఇక వెండి విషయానికి వస్తే కేజీ వెండి ధర రూ.100 తగ్గి, రూ. 132,900 కి చేరుకుంది.

## రాష్ట్రంలో ప్రైవేట్ కాలేజీల బంద్



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రైవేట్ వృత్తి విద్యా కాలేజీలు సోమవారం నుంచి బంద్ పాటిస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు కాలేజీ యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. దీంతో యాజమాన్యాలు బంద్ చేపట్టాయి. రాష్ట్రంలో 10 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయని ఫెడరేషన్ నాయకులు తెలిపారు. దసరాలోపు రూ.1,200 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా.. నేడు మరోసారి చర్చలు నిర్వహించనున్నారు.

# మత్తు వదలరా?

తెలంగాణలో మత్తు పదార్థాల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. మాదక ద్రవ్యాల వినియోగం పెచ్చరిల్లింది. అడ్డగోలు సంపాదనకు అలవాటు పడిన అక్రమార్కులు నిషేధిత గంజాయి, డ్రగ్స్ దందాకు తెరలేపారు. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా తయారీ, సరఫరా చేస్తున్నారు. ఏకంగా ఓ పాఠశాలలోనే మత్తు పదార్థాలు తయారీచేస్తూ పట్టుబడడం రాష్ట్రంలో కలకలం రేపింది. రేపటి సమాజాన్ని తీర్చిదిద్దే విద్యాలయంలోనే అల్ప్రాజోలం తయారు చేస్తున్న ఘటన బయటపడడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఓవైపు మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా, మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న తరుణంలో హైదరాబాద్ బోయిన్‌పల్లిలో వెలుగు చూసిన ఈ ఘటన అందరినీ నివ్వెర పరిచింది. తాజా ఉదంతం అబ్కారీ శాఖ, నార్కోటిక్స్, పోలీసుల పనితీరును ఎత్తి చూపింది.

-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



■ విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి, అల్ప్రాజోలం దందా ■ నిర్లక్ష్యంలో ఎక్సైజ్, నార్కోటిక్స్ విభాగాలు

హైదరాబాద్ బోయినపల్లిలోని శ్రీమేధా స్కూల్‌లో డ్రగ్స్ తయారు చేస్తున్న ఘటన ప్రజలను ఉలిక్కి పడేలా చేసింది. పొద్దున పూట పాఠశాల నిర్వహిస్తుండగా, ఆ తర్వాత నుంచి అల్ప్రాజోలం తయారీ చేస్తున్నట్లు తేలింది. స్కూల్ యజమాని మలేలా జయప్రకాశ్‌గౌడ్ పదినెలలుగా అల్ప్రాజోలం తయారుచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. తన బైక్ మీదనే దాన్ని కస్టమర్లకు సరఫరా చేసేవాడు. అతడితో పాటు పలువురిని అరెస్టు చేసిన ఈగల్ టీమ్ లోతుగా దర్యాప్తు చేస్తోంది. దీని వెనక ఎవరెవరు ఉన్నారు.. ఎక్కడెక్కడికి సరఫరా చేశారనే దానిపై దృష్టి సారించింది. మరోవైపు, శ్రీమేధా పాఠశాల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసిన విద్యాశాఖ ఆ పాఠశాలను సీజ్ చేసింది. దీంతో 130 మంది విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనలో పడింది.

### మాదక ద్రవ్యాల సరఫరా..

ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల మామూళ్ల పర్వం నేపథ్యంలో మాదక ద్రవ్యాల తయారీ, సరఫరా ముఠాలు రెచ్చిపోతున్నాయి. విద్యార్థులు, యువతనే టార్గెట్‌గా చేసుకుని దందా సాగిస్తున్నాయి. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన డ్రగ్స్ నేడు చిన్న చిన్న పట్టణాలు, పల్లెలకు కూడా చేరాయి. పబ్బులు, ఫామ్‌హౌస్‌లలోనే వినియోగించే మాదక ద్రవ్యాలు అంతటా సర్వసాధరణంగా మారాయి. చాలా ఖరీదైన కొకైన్, ఎఫిడ్రిన్ కూడా సులువుగా దొరుకుతున్నాయి. ఇక గంజాయి సరఫరాకు అడ్డే లేకుండా పోయింది. దీనికి తోడు కల్తీ కల్లు కూడా ఏరులై పారుతోంది. అల్ప్రాజోలం, హైడ్రోక్లోరేట్ వంటి వాటితో తయారుచేసిన కల్లు ఊరూరా ఉప్పొంగుతోంది. కల్తీ కల్లు తాగి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తూనే ఉన్నాయి. అయినా ఎక్సైజ్, నార్కోటిక్స్ విభాగాలు అడుగు బయటపెట్టడం లేదు.

### పాఠశాలలు, కళాశాలల్లో సరఫరా..

మత్తు పదార్థాల విక్రయాలకు అడ్డుకట్ట పడడం లేదు. ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా విక్రయాలు సాగుతున్నాయి. ఏకంగా పాఠశాలలు, కళాశాలల్లోనే వీటిని విక్రయిస్తున్న ఘటనలు గతంలో పలుమార్లు బయటపడ్డాయి. కళాశాలలు, పాఠశాలలకు ఆనుకుని ఉన్న చిన్న చిన్న షాపుల్లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఉదంతాలు వెలుగు చూశాయి. విచ్చలవిడిగా దొరుకుతున్న మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్న విద్యార్థులు.. బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి తోడు మామూళ్లు తోడవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా యువత, విద్యార్థులను టార్గెట్‌గా చేసుకుని దందా సాగిస్తున్నారు.

### ఫలించని ప్రభుత్వ ప్రయత్నాలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్రగ్స్, గంజాయి నియంత్రణపై దృష్టి సారించింది. డ్రగ్స్ వాడకాన్ని నియంత్రించేందుకు హోటళ్లు, పబ్బులపై దాడులు చేయించింది. మరోవైపు, మత్తుపదార్థాల తయారీ, సరఫరాపై అడ్డుకట్టు వేసేందుకు ఈగల్ టీమ్‌ను రంగంలోకి దించింది. అడపాదడపా డ్రగ్స్, గంజాయి ముఠాలను పట్టుకుంటున్నా పూర్తి స్థాయిలో కట్టడి చేయలేకపోతోంది. రాష్ట్రవ్యాప్తంగా వేళ్లూనుకున్న ముఠాల ఆట కట్టించడంలో వైఫల్యం చెందుతోంది. నార్కోటిక్స్, ఎక్సైజ్ కలిసి పని చేస్తేనే మాదక ద్రవ్యాలను అడ్డుకునే అవకాశముంది. కానీ శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

## ఐపీవోల సందడి





**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** దేశీయ స్టాక్ మార్కెట్‌లో ఈవారంలోనూ ఐపీవోల సందడి కొనసాగనుంది. ఆరు కంపెనీల సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుండగా.. 12 కంపెనీలు లిస్ట్ అవనున్నాయి. అయితే అందరి దృష్టి బుధవారం లిస్టయ్యే అర్బన్ కంపెనీపై కేంద్రీకృతమై ఉంది. దీని జీఎంపీ 60 శాతానికిపైగా ఉండడమే ఇందుకు కారణం. ఈ వారంలో ఆరు కంపెనీల పబ్లిక్ ఇష్యూ ప్రారంభం కానుంది. ఇందులో మెయిన్ బోర్డు కేటగిరీలో మూడు కంపెనీలు ఉండగా.. ఎస్ఎంఈ సెగ్మెంట్‌కు చెందినవి మరో మూడున్నాయి. మెయిన్‌బోర్డుకు చెందిన యూరో ప్రతీక్ సేల్స్, వీఎంఎస్ టీఎంటీ కంపెనీ, ఐవాల్యూ ఇన్ఫో సొల్యూషన్స్‌తో పాటు ఎన్ఎస్ఈ.. ఎస్ఎంఈ టెక్‌డీ సైబర్ సెక్యూరిటీ, బీఎస్ఈ ఎస్ఎంఈలు సంపత్ అల్యూమినియం, జేడీ కేబుల్స్ కంపెనీలు ఉన్నాయి.

## డీఎస్సీ ఫైనల్ లిస్ట్ విడుదల




**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ మెగా డీఎస్సీ ఫైనల్ లిస్ట్‌ను అధికారులు సోమవారం ఉదయం విడుదల చేశారు. రాష్ట్రంలో 16,347 టీచర్ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఏపీలోని అభ్యర్థులు ఎంతగానో ఎదురు చూస్తున్న డీఎస్సీ తుది జాబితా విడుదలైంది. కొలువులకు ఎంపికైన వారి వివరాలను విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు మెగా డీఎస్సీ వెబ్‌సైట్‌లో వారి వివరాలు అందుబాటులో ఉంచింది. కలెక్టర్, డీఈవో కార్యాలయాల్లో సైతం జాబితా అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

## జార్ఖండ్‌లో ఎన్‌కౌంటర్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మావోయిస్టులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు సహా ముగ్గురు మావోలు హతమయ్యారు. హజారీబాగ్ జిల్లాలో సోమవారం భద్రతా దళాలతో జరిగిన కాల్పుల్లో సహదేవ్ సోరెన్ మృతి చెందాడు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు అయిన ఆయన తలపై రూ.కోటి రివార్డు ఉంది. సోరెన్‌తో పాటు స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు రఘునాథ్ హెంబ్రామ్, జోనల్ ఏరియా కమిటీ విర్సేన్ గంజు హతమయ్యారు. గోర్హార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంతిత్రి అడవిలో సోరెన్ దళానికి, భద్రతా దళానికి మధ్య ఉదయం 6 గంటల ప్రాంతంలో కాల్పులు జరిగాయని పోలీసులు తెలిపారు.

## మహారాష్ట్ర గవర్నర్‌గా ఆచార్య దేవవ్రత్



**అక్షరటుడే, ముంబై :** మహారాష్ట్ర గవర్నర్‌గా ఆచార్య దేవవ్రత్ సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం గుజరాత్ గవర్నర్‌గా కొనసాగుతున్నారు. మహారాష్ట్రగా గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్ ఇటీవల ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గుజరాత్ గవర్నర్‌గా ఉన్న ఆచార్య దేవవ్రత్‌ను మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర్.. రాజ్ భవన్‌లో దేవవ్రత్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'కుటుంబం అన్నాక గొడవలు ఉంటాయి'



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఆ స్థానాన్ని ఎలాగైనా గెలుచుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం తెలంగాణ భవన్‌లో వెంగళరావు నగర్ డివిజన్ బూత్ కమిటీతో సమావేశమయ్యారు. కుటుంబం అన్నాక గొడవలు, పంచాయితీలు ఉంటాయని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే బజార్లో పడి కొట్టుకోవడం పద్ధతి కాదన్నారు. కాగా.. ఇటీవల కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్‌పై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. కాగా.. ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సామరస్యంగా కలిసి మెలిసి పనిచేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. జూబ్లీహిల్స్ స్థానాన్ని గెలుచుకోవడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు.

## 'పేదల పొట్ట కొడుతున్న ప్రభుత్వం'



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** రేవంత్‌రెడ్డి ధన దాహానికి పేద ప్రజలు బలవుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చి పేదల పొట్ట కొడుతోందని మండిపడ్డారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులు సోమవారం హరీశ్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సర్కారుపై ఆయన నిప్పులు చెరిగారు. రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు అలైన్‌మెంట్ మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల భూములను లాక్కుంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అనాలోచిత చర్యల వల్ల రైతులు పంట భూములను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## వెనక్కి తగ్గిన ట్రంప్.. విదేశీ ఉద్యోగులకు ఆహ్వానం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** విదేశీ విద్యార్థులు, ఉద్యోగులపై కొంతకాలంగా కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు వెనక్కి తగ్గారు. దక్షిణ కొరియా దెబ్బకు దిగొచ్చారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ట్రంప్ అక్రమ వలసలపై కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అమెరికాలో ఉద్యోగాలు అమెరికన్లకే ఇవ్వాలంటూ ఆయన చెబుతున్నారు. ఈ క్రమంలో పలువురు అక్రమ వలసదారులను వారి దేశాలకు పంపించారు. అయితే తాజాగా ట్రంప్ విదేశీ ఉద్యోగులను కూడా ఆయా కంపెనీలు నియమించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అగ్రరాజ్యంలో పెట్టుబడులపై ఆలోచిస్తామని దక్షిణ కొరియా హెచ్చరించడంతో ట్రంప్ దిగొచ్చారు. విదేశీ ఉద్యోగులకు ఆహ్వానం అంటూ పోస్ట్ పెట్టారు.

విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెడుతున్నాయని ట్రంప్ అన్నారు. ఆ సమయంలో వారికి అవసరం ఉన్న ఉద్యోగులను ఇతర దేశాల నుంచి అవి తెచ్చుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. చిప్స్, సెమీ కండక్టర్స్, కంప్యూటర్లు, ఓడలు, రైళ్లు మరియు అనేక ఇతర ఉత్పత్తులను ఎలా తయారు చేయాలో నేర్చుకోవాలని ఆయన అమెరికన్లకు సూచించారు. ఇతర దేశాల నిపుణుల దగ్గర నుంచి వాటిని నేర్చుకోవాలన్నారు. అలా నేర్పించడానికి ఉద్యోగులు అవసరం అని పేర్కొన్నారు. "మేము వారిని స్వాగతిస్తాం, వారి ఉద్యోగులను ఆహ్వానిస్తాం.. వారి నుంచి నేర్చుకుంటాం" అని ట్రంప్ పోస్ట్ చేశారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షాలు.. నాలాలో ముగ్గురు గల్లంతు

**అక్షరటుడే, హైదరాబాద్ :** భారీ వర్షాలతో హైదరాబాద్ అతలాకుతలమైంది. గంట వ్యవధిలోనే 12 సెంటిమీటర్ల వర్షం కురవడంతో నగరం స్తంభించి పోయింది. ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపైకి నీళ్లు రావడంతో రాకపోకలకు తీవ్ర ప్రభావంచూపింది. మరోవైపు, నాలాలు ఉప్పొంగడంతో వేర్వేరు చోట్ల ముగ్గురు గల్లంతయ్యారు. ముషీరాబాద్, నాంపల్లి, పార్సిగుట్టతో సహా అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బృందాలు రంగంలోకి దిగి గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టాయి.

## 'లోక'కి భారీ ఓటీటీ డీల్..

మలయాళ చిత్ర పరిశ్రమలో ఇటీవల విడుదలైన చారిత్రక విజయాన్ని అందుకున్న చిత్రం లోక చాప్టర్ 1. ఆగస్టు 28న విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులని ఎంతగానో అలరించింది. రూ.35 కోట్ల బడ్జెట్ తో రూపొందిన ఈ సినిమా ఇప్పటి వరకు రూ.250 కోట్ల క్లబ్‌లో చేరి కలెక్షన్ల పరంగా కూడా సరికొత్త రికార్డులు సృష్టించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ రైట్స్ డీల్ మరోసారి సినిమా బిజినెస్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం మేరకు, ఈ సినిమాకు ఓటీటీ రైట్స్‌ను ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది. ఈ డీల్ విలువ సినిమా బడ్జెట్ కంటే ఎక్కువగా ఉందని టాక్.

–అక్షరటుడే, సినిమా డెస్క్

